సాక్షి విజయనగరం

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024

దాచుకున్న పింఛన్ డబ్బులు చోరీ



పాచిపెంట: మండల కేంద్రంలోని రాచవీధిలో ఓ ఇంట్లో పట్టపగలు ఓ మహిళ దాచుకున్న పింఛన్ డబ్బులు చోరీకి గురైనట్టు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక రాచవీధిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న కలగర్ల రవణమ్మ అనే పింఛన్‌దారు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ డబ్బులు దాచుకుంటోంది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కూరగాయలు కొనేందుకు బజారుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఆమె దాచుకున్న పింఛన్ డబ్బులు రూ.20వేలు లేకపోవడంతో ఇంట్లో దొంగలు పడినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ శ్యామ్ తెలిపారు.

వీఆర్ఎస్ ప్రాజెక్టు నీరు విడుదల

మక్కువ: ఒడిశాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సువర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వెంగళరాయసాగర్ ప్రాజెక్టులోకి 500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు రెగ్యులేటర్ నుంచి తిరిగి నదిలోకి 300 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

న్యూస్‌రీల్

వరిసాగు లక్ష్యం 90వేల హెక్టార్లు

తెర్లాం: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు లక్ష్యం 90వేల హెక్టార్లగా జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు పేర్కొన్నారు. తెర్లాం మండలం ఎం.ఆర్ అగ్రహారంలో స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఇంతవరకు 95 శాతం వరినాట్లు పూర్తయ్యాయన్నారు. బొండపల్లి, పూసపాటిరేగ మండలాల్లో సాధారణం కంటే తక్కువ విస్తీర్ణంలో వరి ఉబాలు జరిగాయని తెలిపారు. జిల్లాకు 13వేల టన్నుల యూరియా అవసరమని ప్రతిపాదనలు పంపించగా, ఇంతవరకు 11వేల టన్నుల యూరియా వచ్చిందని, మరో 2వేల టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ఈ నెల 10వ తేదీలోగా పూర్తిచేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించామని చెప్పారు. ఆయనవెంట తెర్లాం ఏఓ జి.సునీల్‌కుమార్ ఉన్నారు.

వరద బాధితులకు సరుకుల సరఫరా

- 5.50 టన్నుల నిత్యావసర సరుకులు పంపించిన జిల్లా యంత్రాంగం
- వాహనానికి జెండా ఊపిన కలెక్టర్ అంబేడ్కర్



నిత్యావసర సరుకుల వ్యాన్‌కు జెండా ఊపుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా నుంచి విజయవాడ వరద బాధితులకు రెండోరోజు వరద సహాయం పంపించే కార్యక్రమం కొనసాగింది. 5.50 టన్నుల కూరగాయలు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లతో వెళ్లే వాహనానికి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం జెండా ఊపి ప్రారంభించారు. దొండకాయలు, బంగాళాదుంపలు, క్యాబేజీ, వంకాయలు, ఉల్లి, అరటి, పచ్చిమిరప తదితర కూరగాయలను జిల్లాలోని రైతుబజార్లు, హోల్‌సేల్ డీలర్ల వద్ద నుంచి సేకరించి పంపించామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ బి.రవికిరణ్ తెలిపారు. వీటితోపాటు 150 కేసుల వాటర్ బాటిళ్లు, 15 బాక్సుల బిస్కెట్లు పంపించామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలోని అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి లైసెన్సు, అనుభవం, తదితర వివరాలతో సెక్రటరీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యూనివర్సిటీ ప్రధాన రోడ్డుకు స్థల పరిశీలన పూర్తి



గిరిజన యూనివర్సిటీకి నిర్మించనున్న 120 అడుగుల రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుధారాణి, రెవెన్యూ అధికారులు

దత్తిరాజేరు: చినమేడపల్లి - మర్రివలస రెవెన్యూ పరిధిలో తలపెట్టిన గిరిజన యూనివర్సిటీకి జాతీయ రహదారి నుంచి నిర్మించనున్న రోడ్డుకు స్థల పరిశీలన పూర్తయినట్టు బొబ్బిలి ఆర్డీఓ సుధారాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి నుంచి యూనివర్సిటీకి రోడ్డు నిర్మాణానికి తొలుత ప్రతిపాదించిన జిరాయితీ స్థలంతో పాటు ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆనుకొని ఉన్న తోటను గురువారం పరిశీలించారు. ఇది అనుకూలంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు పక్క నుంచి 120 అడుగుల రోడ్డు వేయడం వల్ల దూరం తగ్గుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భూమి సేకరణలో యజమానులకు ఎంత పరిహారం ఇవ్వాలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. దత్తిరాజేరు, రామభద్రపురం తహసీల్దార్లు విజయభాస్కర్, సులోచనారాణి, సర్వేయర్ తిరుపతిరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో కలెక్టర్ అంబేడ్కర్, ప్రజాప్రతినిధులు

గురువుకు సత్కారం

- ఉపాధ్యాయులది వృత్తికాదు.. సామాజిక బాధ్యత: కలెక్టర్
- 75 మంది ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

సాంస్కృతిక ప్రదర్శనలు.. గురువులకు సత్కారాలు.. ఆలోచింపజేసే ప్రసంగాలతో గురుపూజోత్సవం గురువారం వైభవంగా సాగింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలో ఉత్తమ సేవలందించిన 75 మంది ఉపాధ్యాయులను కలెక్టర్, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అవార్డులను ప్రదానం చేశారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని మానవ అభివృద్ధికి దోహదపడే సామాజిక బాధ్యతగా ఉపాధ్యాయులు తీసుకో వాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. వ్యవస్థలను నిలబెట్టేది ఉపాధ్యాయులు మాత్రమేనని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో ఉపాధ్యాయులు పొరపాటు చేస్తే దాని ప్రభావం మొత్తం సమాజంపై ఉంటుందన్నారు.

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఉత్తమ ప్రవర్తనతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. సత్యం, ఉత్తమ ప్రవర్తన, ఆదర్శనీయమైన నడతను అలవాటు చేసుకోవాలని సూచించారు.
- విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ప్రవర్తన అనేది టీచర్ ప్రవర్తించి చూపాలని సూచించారు. నోటితో చెప్పినవి సిలబస్‌గా మాత్రమే గుర్తించాలని, చెప్పిన విషయాలను తూచా తప్పకుండా టీచర్ ప్రవర్తిస్తే అది నిజమైన చదువుగా పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేక దృష్టిసారించిననాడే తరగతిలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

తొలుత చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ, డీఆర్వో ఎస్.డి.అనిత, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. తిరుపతినాయుడు, డిప్యూటీ ఈఓలు కేవీ రమణ, మోహనరావు, డీసీఈబీ సెక్రటరీ టి.స న్యాసిరాజు, డీఈఓ కార్యాలయం ఏడీలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రాస్పత్రికి వీల్‌ఛైర్‌లు పంపిణీ చేస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

- వలు సేవా కార్యక్రమాలు చేపట్టిన చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్

విజయనగరం: జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ముందుగా ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారికి అసోసియేషన్ ప్రతినిధులు పట్టు వస్త్రాలు, పసుపుకుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదం పంపిణీ చేశారు. జిల్లా కేంద్రాస్పత్రిలో దివ్యాంగుల సౌకర్యార్థం వీల్ ఛైర్‌లు అందజేశారు. అనంతరం బాబామెట్టలో గల ఏటీకే అనాథశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ధర్మపురిలో గల సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఒమ్మి శ్రీను, తోట వాసు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, సభ్యులు చందక శ్రీనివాసరావు, ఆర్.అప్పలనాయుడు, హేమంత్, భాస్కర్, రామకృష్ణ, అభిరామ్, చిన్నారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు సరిదిద్దుకోలేక తడబాటు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: గ్రామ అభివృద్ధి పేరుతో సామాజిక పింఛన్ లబ్ధిదారుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేసిన టీడీపీ నాయకుల బండారం బట్టబయలైంది. సీతానగరం మండలం చెల్లన్నాయుడువలసలో పింఛన్ దారుల నుంచి టీడీపీ నాయకుల అక్రమవసూళ్లపై 'పింఛన్ డబ్బులు నొక్కేద్దాం' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆరా తీశారు. విచారణకు ఆదేశించినట్టు సమాచారం. అక్రమ వసూళ్ల విషయం అందరికీ తెలియడంతో టీడీపీ నాయకులు ఉలిక్కిపడ్డారు. తప్పు సరిద్దుకోలేక తడబడుతున్నారు. శని, సోమవారాల్లో పింఛన్ డబ్బులు వసూలు చేయగా, పాత తేదీతో డబ్బులు వసూలు చేసినట్టు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రశీదులు ఇచ్చారు. వాస్తవంగా గ్రామాభివృద్ధి పేరుతో ఎవరి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయకూడదన్న ప్రభుత్వ నిబంధనను మరిచిపోయారు. అందులోనూ కేవలం పింఛన్ దారుల నుంచే ఎందుకు వసూలుచేశారన్న ప్రశ్న తలెత్తుతోంది. తప్పును మళ్లీ తప్పుతో కప్పిపుచ్చుకునే యత్నాలను గ్రామస్తులు తప్పుబడుతున్నారు. అవ్వాతాతల జీవన భృతికోసం ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులను దౌర్జన్యంగా లాక్కోవడం తగదంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



పాత డేట్‌తో అందజేసిన రశీదు

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



మామిడి శ్రీకాంత్



గణపతిరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షుల నియామకం జరిగింది. వాటిలో తూర్పుకాపు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్, దాసరి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రంగముద్రి గణపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని గళావిల్లి గ్రామానికి చెందిన మామిడి శ్రీకాంత్ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా గతంలో శ్రీకాంత్ పనిచేశారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా 2021లో నియామకయ్యారు. 2024 ఏప్రిల్ వరకూ ఆ పదవిలో ఉన్నారు. పార్టీకి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా తనకు రాష్ట్రంలోనే అతిపెద్ద సామాజిక వర్గ విభాగానికి అధ్యక్షుడిగా అవకాశమిచ్చిన పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో పలు విద్యాసంస్థలు, ఐటీ కంపెనీలను ఏర్పాటుచేసిన డాక్టర్ రంగముద్రి గణపతిరావు వైఎస్సార్‌సీపీలో పలు సేవలు అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఉత్తరాంధ్ర కీలకమైన దాసరి సామాజికవర్గ రాష్ట్ర విభాగానికి ఆయనను అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన భార్య డాక్టర్ రంగుముద్రి రమాదేవి రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

జిల్లాకు భారీ వర్షసూచన

- రానున్న మూడు రోజుల పాటు కురిసే అవకాశం
- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి
- ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: రానున్న మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆర్డీఓలు, తహసీల్దార్, ఇతర అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేయాలని సూచించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది నిత్యం పర్యటిస్తూ ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ముంచెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల నోడల్ అధికారులు నిరంతం క్షేత్ర స్థాయి సిబ్బందిని సమన్వయ చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు.

యువత నైపుణ్యాలపై స్కిల్ సర్వే

విజయనగరం అర్బన్: జిల్లాలో వివిధ రకాల నైపుణ్యాలు కలిగిన యువత ఏ మండలంలో ఎంత మంది అందుబాటులో ఉన్నారనే అంశంపై జిల్లా వ్యాప్తంగా స్కిల్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. సర్వే సమాచారం ఆధారంగా జిల్లాలో తదుపరి జాబ్‌మేళాలు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించాలని స్పష్టం చేశారు. తన చాంబర్లో గురువారం నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశంలో జాబ్ క్యాలెండర్ అమలుపై సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ ఎన్.గోవిందరావు వివరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాలు, పత్రికా, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఉపాధికల్పన అధికారి అరుణకుమారి, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, జాబ్స్‌మేనేజర్ మార్టిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర రిజర్వాయర్‌లో మునిగి యువకుడి మృతి



భీమరాజు మృతదేహం

మెంటాడ: ఆంధ్ర రిజర్వాయర్‌లో మునిగి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ బీటుగరువు గ్రామానికి చెందిన గమ్మెళ భీమరాజు(22) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్ర రిజర్వాయర్‌లో చేపల వేటకు పరిసర గ్రామాల గిరిజనులు వస్తుంటారు. ఎప్పటిలాగే మంగళవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో బీటుగరువు గ్రామానికి చెందిన పలువురు చేపల వేటకు వెళ్లారు. భీమరాజుతో పాటు ముగ్గురు యువకులు వలవేసి చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు భీమరాజు నీటిలో మునిగిపోయాడు. మిగిలిన ముగ్గురు ఒడ్డున ఉండి ఎంతకీ రాకపోవడంతో వేరే మార్గంలో వెళ్లిపోయి ఉంటాడని భావించి వెనక్కి వెళ్లిపోయారు. తీరా చూస్తే ఇంటికి భీమరాజు చేరలేదు. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు మృతదేహం తేలడం చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరిన పోలీ సులు విచారణ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్ట్

విజయనగరం క్రైమ్: డెంకాడ మండలం చింతలవలస గ్రామ ఎంవీజీఆర్ వద్ద ఉన్న నీలగిరి తోటలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ఏడుగురు నిందితులను డెంకాడ పోలీసులు అరెస్టు చేశారు. రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ వకుల్ జిందల్ తెలిపిన వివరాల ప్రకారం.. డెంకాడ, శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, అల్లూరి సీతారామరాజు(ఏఎస్ఆర్) జిల్లాకు చెందిన వ్యక్తితో కలిసి ఎంవీజీఆర్ కళాశాల వద్ద నీలగిరి తోటలో గంజాయి విక్రయిస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో ఎస్ఐ సన్యాసినాయుడు సిబ్బందితో దాడి చేశారు. వారి నుంచి 2 కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం, బూర్జ పంచాయతీ పరిధి వంచనారంగిని గ్రామానికి చెందిన సామర్ది నాగేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన గణేశ్వరం సంజయ్‌కుమార్, డెంకాడ మండలం రఘుమండ గ్రామానికి చెందిన దుర్గాసి కనకరాజు, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లికి చెందిన టొంపల నాగభూషణం, రణస్థలానికి చెందిన రాజ మహంతి అనిల్ కుమార్‌లతో పాటు డెంకాడ మండలం రఘుమండ గ్రామానికి చెందిన బత్తుల కిరణ్, చింతలవలసకు చెందిన చీకటి సందీప్ గంజాయి సేవించడానికి, విక్రయించడానికి అలవాటు పడ్డారు.

వీరిలో సామర్ధి నాగేశ్వరరావు గంజాయి పండిస్తాడు. గణేశ్వరం సంజయ్‌కుమార్, దుర్గాసి కనకరాజుకు గంజాయి విక్రయిస్తాడు. వారు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సరఫరా చేస్తారు. గంజాయి కావాల్సిన వారికి, కళాశాలల విద్యార్థులకు చిన్న మొత్తాల్లో విక్రయించే వారికి అమ్ముతుంటారన్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు వచ్చిన సమాచారంతో ఏడుగురును అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు.

మట్టి గణపతినే పూజిద్దాం

విజయనగరం అర్బన్: వినాయక చవితి రోజున మట్టి గణపతి ప్రతిమనే పూజించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి గణపతి విగ్రహాలు పూజించడం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ జిల్లా కాలుష్య నియంత్రణ శాఖ రూపొందించిన పోస్టర్‌ను తన చాంబర్‌లో గరువారం ఆవిష్కరించారు. మట్టి గణపతి ప్రతిమను జిల్లా కాలుష్య నియంత్రణ ఇంజినీరు సరిత కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.డి.అనిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, పైడితల్లి అమ్మవారి కోవెల, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూపూర్ణా జంక్షన్, ఆర్‌అండ్‌బీ రైతు బజార్ జంక్షన్ల వద్ద శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్టు పొల్యూషన్ కంట్రోల్ విభాగం ఇంజినీర్ సరిత తెలిపారు. భక్తులందరూ విగ్రహాలను పొందాలని కోరారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

అక్రమార్కుల్లో వణుకు

- రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పుపై తహసీల్దార్ ఆరా

బొబ్బిలి:

సాక్షి ఎఫెక్ట్...

మండల కేంద్రంలోని సీబీఎం బాలికోన్నత పాఠశాల ఆస్తుల విక్రయ తతంగం బయటపడుతోంది. రెవెన్యూ అధికారుల ఆరాతో అక్రమార్కుల్లో వణుకుపుడుతోంది. 'సీబీఎం ఫర్ సేల్' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ ఎం.శ్రీను స్పందించారు. కన్వెన్షన్ ఆఫ్ బాప్టిస్టు చర్చస్ ఆఫ్ నార్తరన్ సర్కార్ (సీబీసీఎన్‌సీ) ట్రస్టు బొబ్బిలి ప్రాంతంలో ఏర్పాటుచేసిన సీబీఎం పాఠశాల రికార్డులు ఎవరి హయాంలో మార్పులు, చేర్పులు జరిగాయో ఆరా తీశారు. ట్రస్టు ఆస్తులను వ్యక్తిపేరు మీద ఎలా మార్పుచేశారంటూ ఆర్ఐ కళ్యాణచక్రవర్తిని ప్రశ్నించారు. కేవలం ట్రస్టు తరపున కరస్పాండెంట్ పేరు మాత్రం ఉండాలే తప్ప, వ్యక్తిపేర్లు ట్రస్టు ఆస్తులకు ఉండవని స్పష్టం చేశారు.

మార్పులు ఇలా...

గతేడాది ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన డోల రాజేశ్వరరావు సమయంలోనే సీబీఎం పాఠశాల ఆస్తిపై అక్రమార్కుల కన్నుపడింది. 1920వ సంవత్సరంలో కెనడియన్స్ ఎకరా 22 స్థలాన్ని కొనుగోలుచేసి పాఠశాలను స్థాపించారు. ఆనాడు ఆన్‌లైన్ విధానం లేకపోవడంతో వారి ఏర్పాటుచేసిన ట్రస్టు ఆధీనంలో ఉండేది. ఆన్‌లైన్ విధానం వచ్చిన నాటి నుంచి సీబీఎం పాఠశాల ప్రభుత్వ ఆస్తిగా 22ఏలో నమోదుకాగా నాటి నుంచి అలాగే ఉంది. ఈ క్రమంలో 2023 సెప్టెంబర్ 19వ తేదీన దానిని పూర్తి సీబీఎం పాఠశాల ఆస్తిగా ఆన్‌లైన్‌లో మార్పుచేసి 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అదే ఏడాది అక్టోబర్ 23న ఎం.రత్నకుమార్ పేరుపై నమోదుచేశారు. ఈ మొత్తం వ్యవహారం తహసీల్దార్ కనుసన్నల్లోనే జరిగిందని ట్రస్టు సభ్యులు ఆరోపిస్తుండగా, ప్రస్తుత తహసీల్దార్ ఎం.శ్రీను దానిని ధ్రువీకరించారు. అసలు రత్నకుమార్ అనే వ్యక్తికి సీబీసీఎన్‌సీకి సంబంధంలేదని, ఆయన తప్పుడు పత్రాలతో తనపేరు మీద మార్చుకుని అమ్మకానికి పెట్టి స్కూల్ మూసివేసేందుకు రెన్యూవల్ చేయలేదని సీబీఎం చర్చి సభ్యుల వాదన. దీనికి బలం చేకూరేలా అప్పట్లో సీబీసీఎన్‌సీ సంస్థను ఏర్పాటుచేసి కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేశారు. ప్రతి ఏడాది సమావేశాలు ఏర్పాటుచేసి మినిట్స్‌ను, సభ్యుల వివరాలను వారికి సమర్పించాల్సి ఉంది. వీరే సంబంధిత సీబీఎన్‌సీ ఆస్తులకు హక్కుదారులను, అనుభవదారులను, అధికారం ఉన్నవారని తెల్పి డీఆర్ కాపీ ఇవ్వాలి. అప్పుడే సీబీసీఎన్‌సీ ఆస్తులపైన, పాఠశాలపైన వీరికి పూర్తి అధికారం ఉంటుంది. సీబీసీఎన్‌సీ రిజిస్టర్ నంబర్‌తో అందులో గతంలో సభ్యులుగా ఉన్నవారు విడిపోయి కోకొల్లుగా సంస్థలు ఏర్పాటుచేసుకుని తామే ఆస్తులకు నిజమైన వారసత్వం కలిగిన సీబీసీఎన్‌సీగా చెప్పుకుంటూ కోర్టులచుట్టూ తిరుగుతున్నారు. ఈ సంస్థల్లో ఏది నిజమైనదో కోర్టు తేల్చి డీఆర్ గుర్తింపును పొంది కాపీని ఇవ్వాల్సి ఉన్నా, ఏదీ తేలక కాకినాడ డీఆర్ గత 20 ఏళ్లుగా ఎవ్వరికీ గుర్తింపు ఇవ్వలేదని సీబీసీఎన్‌సీ సభ్యులు చెబుతున్నారు. మరి ఏ హక్కుతో పేరు, కరస్పాండెంట్‌గా అధికారులు గుర్తించారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ తతంగం మొత్తానికి బడాబాబులు వెనుకనుంచి నడిపిస్తున్నారన్నది వారి వాదన. మరి ఏ హక్కుతో రత్నకుమార్ కరస్పాండెంట్ అయ్యాడో, ఎవరు గుర్తించారో, ఈ 100 కోట్ల ఆస్తిపై ఎవరి కన్నుపడిందో ఉన్నతాధికారులు దర్యాప్తుకు ఆదేశించి విచారిస్తే బయటపడుతుంది. మరి ఉన్నతాధికారుల తీర్పు ఎలా ఉంటుందో వేచిచూడాలి మరి!



సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనం చూపిస్తూ ఆర్ఐను ప్రశ్నిస్తున్న తహసీల్దార్ శ్రీను

